క్లుప్తంగా

కడప నగరపాలక ఇన్‌చార్జి కమిషనర్‌గా వైఓ నందన్



కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్‌గా వైఓ నందన్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కడప పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) వైస్ చైర్మన్‌గా ఉన్న ఆయనకు కడప కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ శ్రీహరినారాయణ్ నియమించారు. గతనెల 26వ తేదీన కడప కమిషనర్‌గా ఉన్న జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ బదిలీ అయ్యాక ఆయన స్థానంలో మరో ఐఏఎస్ అధికారి తేజ్ భరత్‌ను నియమించగా ఆయన బాధ్యతలు స్వీకరించలేదు. అప్పటి నుంచి కడప కమిషనర్‌గా ఎవరికీ ఎఫ్ఏసీ బాధ్యతలు కూడా ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి వైఓ నందన్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

నేడు క్విజ్ కాంపిటీషన్

వైవీయూ: స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని హర్ ఘర్ తిరంగాలో భాగంగా బుధవారం జిల్లాలోని యువతకు క్విజ్ కాంపిటీషన్ నిర్వహిస్తునట్లు నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి మణికంఠ తెలిపారు. ఈ క్విజ్‌లో కరెంట్ అఫైర్స్, హిస్టరీ, పాలిటి, జియోగ్రఫీ, సైన్స్ అండ్ టెక్నాలజీ అలాగే అన్ని సబ్జెక్టులపై ప్రశ్నలు ఉంటాయని, అన్ని కాంపిటీటివ్ ఎగ్జామ్స్ ప్రిపేర్ అవుతున్న విద్యార్థులందరూ పాల్గొనవచ్చునని తెలిపారు. ఈ క్విజ్ పోటీలు కడప నగరం బాలాజీ నగర్ రోడ్ నెంబర్ 13 లోని యూత్ హాస్టల్ మీటింగ్ హాల్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9177616677 సంప్రదించాలని కోరారు.

నేడు మెగా మెడికల్ క్యాంప్

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప రోటరీ క్లబ్ సహకారంతో ఈనెల 14వ తేదీన డా. ఏపీజే అబ్దుల్ కలాం సెంట్రల్ లైబ్రరీ ఆవరణలో 'మెగా మెడికల్ క్యాంప్' నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు మొదలయ్యే ఈ క్యాంపులో వైద్యులు డాక్టర్ వారణాసి ప్రతాప్ రెడ్డి (డయాబెటిస్), డా. ఎ.వంశీధర్ (కార్డియాలజిస్ట్), డా.ఎ. విద్యాధర (నేత్ర వైద్యులు), డా. ఎం.డి. ఫర్హానుద్దీన్ (డెంటిస్ట్), వైవీయు హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ నరేష్ కుమార్ రెడ్డి ఆయా వ్యాధులకు వైద్య సేవలు అందజేస్తారన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, రీసెర్చ్ స్కాలర్స్, అకడమిక్ కన్సల్టెంట్స్, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.


అవయవదానంపై అవగాహన కలిగి ఉండాలి



అవయవదానంపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : మనిషి బ్రెయిన్ డెడ్, మృతి చెందిన తర్వాత చేసే అవయవదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్యులు ప్రశాంత్ వర్ధన్, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత పిలుపునిచ్చారు. మంగళవారం కడప నగరం నాగరాజుపేట అర్బన్ ట్రైనింగ్ హెల్త్ సెంటర్‌లో 'ప్రపంచ ఆర్గన్ డొనేషన్' పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్గన్ డొనేషన్ అనేది మనిషి బ్రెయిన్ డెడ్, మృతి చెందిన తర్వాత శరీర భాగాలను డొనేషన్ చేసినట్లయితే వాటిని అనారోగ్యవంతులకు ఆపరేషన్ ద్వారా అమర్చడం జరుగుతుందన్నారు. అనారోగ్య సమస్యలు లేని ప్రతి ఒక్కరూ శరీర భాగాలైన గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, కళ్ళు ఇలా అన్ని భాగాలను డొనేట్ చేయవచ్చన్నారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ హోమియోపతి డాక్టర్లు శ్రీనివాస్ నాయక్, డాక్టర్ హేమ, డాక్టర్ గ్రేసీ, డాక్టర్ యశస్విని పాల్గొన్నారు.

సీఎస్‌సీతో నిర్మల ఫార్మసీ కళాశాల ఒప్పందం



ఒప్పందం కుదుర్చుకుంటున్న నిర్మల కళాశాల, సీఎస్‌సీ ప్రతినిధులు

వైవీయూ: కడప నగరంలోని నిర్మల ఫార్మసీ కళాశాల విశాఖ పట్టణానికి చెందిన కౌన్సిల్ ఫర్ స్కిల్ అండ్ కాంపిటెన్సీస్ (సీఎస్‌సీ)తో పరస్పర ఉపాధి నైపుణ్య శిక్షణ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ డా. యు. మోహన్‌కుమార్, సీఎస్‌సీ సలహాదారు వై. రామ్మోహన్‌రావులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ద్వారా 21వ శతాబ్దపు ఉపాధి నైపుణ్యాలను, పారిశ్రామిక వ్యవస్థాపక శిక్షణ అందిస్తామన్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ బి. శ్రీనివాసులు అభినందనలు తెలిపారు.

కడప గడపన..

స్వాతంత్ర్య సమర స్ఫూర్తి

ప్రథమ భారత స్వాతంత్ర్య సమరానికి స్ఫూర్తినిచ్చిన జిల్లా కడప. దేశ వ్యాప్తంగా రగిలిన స్వాతంత్ర్య కాంక్ష జిల్లానూ ప్రభావితం చేసింది. క్విట్ ఇండియా, శాసనోల్లంఘన, హోం రూల్ వంటి అనేక ఉద్యమాలు జిల్లాలో ఉధృతంగా సాగాయి. మహాత్మాగాంధీ మూడు పర్యాయాలు జిల్లాలో పర్యటించి ప్రజల్లో చైతన్యం నింపారు. కడప గడపన సాగిన అలాంటి కొన్ని స్వాతంత్రోద్యమ ఘట్టాల గురించి సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం. - కడప సెవెన్‌రోడ్స్

- రేపు 78వ స్వాతంత్ర్య దినోత్సవం - జిల్లా వ్యాప్తంగా ఘనంగా ఏర్పాట్లు



కడప నగరంలోని కోటిరెడ్డి కూడలి వద్ద ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సంగ్రామ స్ఫూర్తి విగ్రహం

ఉయ్యాలవాడ తిరుగుబాటు

● ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంగా ఆధునిక చరిత్రకారులు పేర్కొనే 1857 నాటి సిపాయిల తిరుగుబాటు అప్పటికి జరగలేదు. భారతీయుల్లో ముఖ్యంగా పల్లె ప్రాంతాల్లో జాతీయభావ బీజాలు సైతం సరిగా పురుడు పోసుకోలేదు. ఏ ప్రేరణ, ఏ అవగాహన, ఏ శక్తుల ఆసరానో తెలియదుగానీ బ్రిటీషు సామ్రాజ్య వాదులపై ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన తిరుగుబాటు భావి జాతీయోద్యమానికి స్ఫూర్తిగా నిలిచింది.

ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనలో చితికిపోయిన రైతులు, కట్టుబడులు, అటవీజాతి ప్రజలు ఇంకా వివిధ వర్గాలు ఈ తిరుగుబాటులో పాల్గొని ప్రాణ త్యాగాలు చేశారు. 1847 ఫిబ్రవరి 22న రేనాటిసూర్యుడు నరసింహారెడ్డిని ఆంగ్ల ప్రభుత్వం కోయిలకుంట్లలో బహిరంగంగా ఉరి తీసింది.

షేక్ పీర్‌షా తిరుగుబాటు

● యల్లంపేటకు చెందిన షేక్ పీర్‌షా అనే అంధుడు బ్రిటీషుపాలకులపై తిరుగుబాటు యత్నాలు చేశారు. 1857 ఆగస్టు 28వ తేది మొహర్రం రోజు కడపలోని మద్రాసు 32వ రెజిమెంట్‌లో ఉన్న స్వదేశీ ఆఫీసర్లు, కంటోన్మెంట్ కాల్బలానికి చెందిన ఆఫీసర్లను ఇందుకోసం పురిగొల్పారు. తిరుగుబాటుదారుల కోసం ఆహార పదార్థాలు, డబ్బు సేకరించారు.

తుపాకులకు పూసే గ్రీసు విషయంలో పంది, ఆవు కొవ్వు సెంటిమెంట్లను సిపాయిల లో రెచ్చగొట్టాడు. షేక్ పీర్‌షా కార్యకలాపాలపై అప్పటికే నిఘా ఉంచిన ప్రభుత్వం ఆయనను అరెస్టు చేసి నామమాత్రపు విచారణ నిర్వహించి పదేళ్ల శిక్ష విధించింది. ఆయనను తిరునల్వేలి జైలులో ఉంచింది.

హోం రూల్ ఉద్యమం

● 1916లో అనిబిసెంట్ చేపట్టిన హోం రూల్ ఉద్యమం మన జిల్లాపై ప్రభావాన్ని చూపింది. దివ్యజ్ఞాన సమాజానికి చెందిన కొందరు హోం రూల్ లీగ్ శాఖలను ఇక్కడ ఏర్పాటు చేశారు. అనంతరం సభలు, సమావేశాలు నిర్వహించారు. 1918లో కడప పట్టణంలో వెంకటపతిరాజు అధ్యక్షతన మొదటి ఆంధ్ర ప్రావెన్షియల్ కాన్ఫరెన్స్ జరిగింది. సకాలంలో భారతదేశానికి అధికారాన్ని బదలాయించే విధంగా పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలని ఈ సమావేశాలలో తీర్మానించారు.

వందేమాతర ఉద్యమం

● 1905లో జరిగిన బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా దేశం యావత్ రగిలిపోయింది. విదేశీ వస్తువులను బహిష్కరించి స్వదేశీ వస్తువులను వినియోగించాలని వందేమాతరం ఉద్యమం ప్రారంభమైంది. జిల్లాలో కూడా సభలు, సమావేశాలు నిర్వహించారు. స్వదేశీ ఉద్యమం, విదేశీ వస్తు బహిష్కరణపై ఎంసీ రామారావు అనే వ్యక్తి ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ప్రాంతాల్లో ప్రజలను రెచ్చ గొట్టే ఉపన్యాసా లు చేస్తున్నారని ఆయన్ను అరెస్టు చేశారు. కడప పట్టణంలో జంగంకోట హరియప్ప, భద్రాచలం వెంకటేశ్వరరావులు స్వదేశీ వస్త్రాలయాలు ప్రారంభించారు.

సహాయ నిరాకరణ ఉద్యమం

● జిల్లాలో ప్రజలు అటవీ చట్టాలను ఉల్లంఘించారు. కల్లు దుకాణాల ఎదుట పికెటింగ్ నిర్వహించారు. విదేశీ వస్త్ర బహిష్కరణ కొనసాగింది. కాంగ్రెస్ కమిటీలను ఏర్పాటు చేసి జాతీయ నాయకులను ఆహ్వానించారు. పెన్నపేరూరు గ్రామానికి చెందిన కరణం కె.సుబ్రమణ్యం ఈ ఉద్యమంలో ఎంతో క్రియాశీలకంగా పాల్గొన్నారు. బద్వేలు తాలూకాలోని గ్రామ గ్రామానికి తిరిగి ప్రభుత్వానికి పన్నులు చెల్లించవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఆయనను ఉద్యోగంలో నుంచి తొలగించడమే కాకుండా రెండు పర్యాయాలు అరెస్టు చేసి జైలుకు పంపింది.

మహాత్ముని అడుగుజాడలు

● 1921 సెప్టెంబరు 30వ తేదీ మహాత్మా గాంధీ తిరుపతిలో బహిరంగసభ ముగించుకుని రాజంపేటకు చేరుకున్నారు. అదేరోజు సాయంత్రం కడపలో జరిగిన బహిరంగసభలో ఆయన పాల్గొన్నారు. రాయలసీమ కరువు సహాయం, స్వరాజ్యనిధికి విరాళాలు సేకరించారు. గాంధీజీ ఉపన్యాసాన్ని గాడిచర్ల హరిసర్వోత్తమరావు తెలుగులోకి అనువదించారు. భూతపురి నారాయణస్వామి, నూకల వెంకట సుబ్బయ్య, కడప ఆర్యవైశ్య సంఘం నాయకుడు రాచూరి సుబ్బరాయుడు తదితరులు గాంధీజీని సత్కరించారు.

● 1929 మే 17వ తేది తాడిపత్రి పర్యటన ముగించుకున్న గాంధీజీ రెండవ పర్యాయం జిల్లాకు వచ్చారు. కొండాపురం, ముద్దనూరు, చిలంకూరు, ఎర్రగుంట్ల గ్రామాల్లో ప్రసంగించారు. కస్తూర్బా గాంధీ కూడా ఆయన వెంట వచ్చారు. ఆ రాత్రి ప్రొద్దుటూరులో బహిరంగసభ నిర్వహించారు. హిందూ, ముస్లిం ఐక్యత, విదేశీ వస్తు బహిష్కరణ, మద్యపాన నిషేధం, అంటరానితనం నిర్మూలనపై గాంధీజీ ప్రసంగించారు.

● 1934 జనవరి 1వ తేది గాంధీజీ కడప పట్టణంలో పర్యటించారు. 2వ తేది సాయంత్రం వరకు కడపలోనే గడిపారు. పట్టణంలో ఒక ఖద్దరు ఎంపోరియంను ప్రారంభించారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు నివసిస్తున్న కాలనీలో పర్యటించారు. ఆరోజు రాత్రి మున్సిపల్ హైస్కూలు మైదానంలో బహిరంగసభ నిర్వహించి ప్రజల్లో స్వాతంత్ర్య దీప్తిని రగిలించారు.

ఖిలాఫత్ ఉద్యమంలో ..

అలీఘర్ ముస్లిం యూనివర్సిటీ నుంచి మహమ్మద్ హుసేన్, షఫీ–ఉర్–రెహ్మాన్ అనే నాయకుడు కడపకు వచ్చి 1921 నవంబరు 11వ తేది ఖిలాఫత్ కమిటీ ఏర్పాటు చేశారు. అదేనెల 21వ తేది పట్టణంలో హర్తాళ్ నిర్వహించారు. కడప డిప్యూటీ మెజిస్ట్రేట్ సెక్షన్ 144 విధించి సభలు, సమావేశాలు నిషేధించారు. అలీఘర్ నుంచి వచ్చిన వారిని సెక్యూరిటీ చెల్లించాలన్నారు. అయితే వారు అందుకు నిరాకరించడంతో ఆరు నెలల శిక్ష విధించి నెల్లూరుకు తరలించారు.

జాతీయ నేతల స్ఫూర్తితో ..

స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో ఎందరో జాతీయ నాయకుల స్ఫూర్తితో కడప కోటిరెడ్డి, సుండుపల్లె ఆదినారాయణరెడ్డి, దేవిరెడ్డి రామసుబ్బారెడ్డి, గాజులపల్లె వీరభద్రరావు, ద్రాక్ష చిన్న గురుమూర్తి, కందుల బాల నారాయణరెడ్డి, స్వర్ణ నాగయ్య, రంతు గోపాల్ లాంటి ఎంతోమంది యువకులు జాతీయోద్యమ జెండా చేతబట్టి ముందుకు సాగారు. అలా ఎందరో వీరుల త్యాగ ఫలితంగా 1947, ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది.



కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్‌లో విద్యుత్ దీప కాంతులు



కడప నగరంలోని ఏడురోడ్ల కూడలి వద్ద..

నగర కూడళ్లలో... విద్యుద్దీప కాంతులు

జిల్లా వ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాలతో పాటు కడప నగరంలో.. యోగి వేమన విశ్వవిద్యాలయంలో భారీ త్రివర్ణ పతాకాలతో ర్యాలీలు చేపట్టారు. పలు పాఠశాలల విద్యార్థులు నగరంలో సందడి చేశారు. కడప నగరంలోని పలు కూడళ్లను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. గురువారం స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లలో లోటుపాట్లు ఉండకూడదు

– నగరపాలక కమిషనర్ వైఓ. నందన్



పాత కలెక్టరేట్‌లో శకటం తయారీ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వైఓ నందన్

కడప కార్పొరేషన్: స్వాతంత్ర్యదినోత్సవ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని నగరపాలక ఇన్‌చార్జి కమిషనర్ వైఓ నందన్ సూచించారు. మంగళవారం ఆయన పోలీస్ పెరేడ్ మైదానంలో నగరపాలక అధికారులతో మాట్లాడుతూ సందర్శకులు, అధికారులకు ఇబ్బంది కలగకుండా తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, తాగునీరు, సీటింగ్ విషయాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం నగరంలోని పాత కలెక్టరేట్‌లో జరుగుతున్న శకటం తయారీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా శకటాల తయారీలో పాటించాల్సిన అంశాలను వివరించారు. పలు సూచనలు చేశారు. 25వ వార్డు రాధాక్రిష్ణ నగర్‌లోని వార్డు సచివాలయం, 24వ వార్డు కో ఆపరేటివ్ కాలనీలోని సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పారిశుద్ధ్యం విషయంలో అశ్రద్ధ చేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ సూరజ్ కుమార్, సూపరింటెండెంట్ జి. శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎంయూలో పలువురి చేరిక



యూనియన్‌లో చేరిన ఉద్యోగులతో ఎన్ఎంయూఏ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపోలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్‌లో చేరినట్లు రాష్ట్ర ఉపాధ్యక్షులు పీవీ శివారెడ్డి తెలిపారు. మంగళవారం యూనియన్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మజ్దూర్ యూనియన్ ముందుకు సాగుతోందన్నారు. ఈ సందర్భంగా రీజియన్ వ్యాప్తంగా సమస్యలపై ఇచ్చిన మెమోరాండంపై చర్చించి పోరాటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం యూనియన్‌లో చేరిన పలువురు ఉద్యోగులను స్వాగతించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ కార్యదర్శి సుధాకర్, డిపో అధ్యక్షులు జయరాం, డిపో నాయకులు శ్రీనివాసులు, ప్రభాకర్, టిమ్ బాష, వరదారెడ్డి పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న వి తైక్వాండో క్లబ్ మాస్టర్ వసీం

కడప స్పోర్ట్స్: ఈనెల 11, 12 తేదీల్లో తిరుపతిలో నిర్వహించిన 1వ సౌత్‌జోన్ జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో కడప నగరానికి చెందిన క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబరిచారు. కడప నగరం కాగితాలపేటలోని ఎంఆర్‌సీ కార్యాలయ ఆవరణంలో నిర్వహిస్తున్న వి తైక్వాండో క్లబ్‌లో శిక్షణ పొందిన క్రీడాకారులు పతకాలు సాధించినట్లు క్లబ్ మాస్టర్ వసీం, కోచ్ నరసింహ తెలిపారు. ఎస్.కె. సుమయ, కె. చంద్రకళ, సుహాన్వికరెడ్డి, ప్రణయ్‌కుమార్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, ఇర్ఫాన్‌లు స్వర్ణపతకాలు సాధించగా, భవ్య, జాహ్నవిసాయి, సాయిచాణుక్యరెడ్డి, కౌశిక్ నారాయణ, సోహిల్, సాజిత్ రజత పతకాలు సాధించినట్లు తెలిపారు. వీరితో పాటు ఊటుకూరులోని బ్రిలియంట్ తైక్వాండో అకాడమీ నుంచి పాల్గొన్న క్రీడాకారులు పతకాలు సాధించినట్లు అకాడమీ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి తెలిపారు. శ్రీను, గురుచరణ్‌లు గోల్డ్‌మెడల్స్, లాహిత్య, తనూజ, పర్ణశ్రీ, దుర్గలు రజత పతకాలు సాధించినట్లు ఆయన తెలిపారు.

బండ్ల బాట ఆక్రమణకు గురికాకుండా కాపాడండి



బండ్లబాటగా చెబుతున్న స్థలం చుట్టూ సిమెంటు పలకలతో ప్రహరీ వేస్తున్న దృశ్యం

కడప కార్పొరేషన్: కడప నగర పరిధిలోని పుట్లంపల్లె గ్రామ పొలం సర్వే నంబర్ 2/2లో బండ్లబాటగా ఉన్న స్థలం ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని స్థానికులు వరలక్ష్మి, రంగారెడ్డి, సాదక్ బాషా, జయరామిరెడ్డి కోరారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ చాలా సంవత్సరాల క్రితం ఒక బిల్డర్ సర్వే నంబర్ 123/10లో ప్లాట్లు వేసి విక్రయాలు చేశారన్నారు. ఆ ప్లాట్లలోకి తాము వెళ్లేందుకు ఈ బండ్లబాట ఉపయోగపడేదన్నారు. గతంలో దీన్ని ఆక్రమించడానికి కొందరు ప్రయత్నించి పునాదులు వేశారన్నారు. తహసీల్దార్ శివరామిరెడ్డి విచారణ చేసి వారి వద్ద ఎలాంటి డాక్యుమెంట్స్ లేనందున వాటిని తొలగించారన్నారు. ప్రస్తుతం తహసీల్దార్ మారడంతో సెలవు రోజైన ఆదివారం ఎవరు లేని సమయంలో బండ్లబాట చుట్టూ కంచె వేశారని తెలిపారు. ఈ ఆక్రమణపై జిల్లా కలెక్టర్‌కు, నగరపాలక సంస్థ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఈడీఏ బ్రహ్మానందరెడ్డికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గజపతి, కుమార్ నాయక్‌లు కోరారు. మంగళవారం రాష్ట్ర ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు పలిశెట్టి దామోదర్‌రావు ఆధ్వర్యంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మిన్) బ్రహ్మానందరెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీఎస్ ఆర్టీసీలో రెండు దశాబ్దాల నుంచి 7800 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వీరికి కనీస వేతనాలు ఎక్కడా అమలు కావడం లేదని, థర్డ్ పార్టీ విధానంపై పని చేస్తున్నారన్నారు. కార్మికులకు ఇచ్చే వేతనాల్లో భారీ స్థాయిలో కార్మికుల వద్ద నుంచి కాంట్రాక్టర్లు దోపిడీకి గురి చేస్తున్నారన్నారు. ఆర్టీసీలో పనిచేసే కార్మికులందరినీ థర్డ్‌పార్టీ విధానాన్ని రద్దు చేసి ఆప్కాస్ కార్పొరేషన్‌లో చేర్చాలని కోరారు. ఈ సందర్భంగా బ్రహ్మానందరెడ్డి సానుకూలంగా స్పందిస్తూ త్వరలో సమస్యను పరిష్కరిస్తూ తగు న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గంగాంజనేయులు, సుధీర్‌కుమార్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంపై మహిళల్లో అవగాహన పెరగాలి



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు

వైవీయూ: సమాజం పట్ల మహిళల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని జనవిజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షులు బి. విశ్వనాథ్ అన్నారు. మంగళవారం మెప్మా ఆధ్వర్యంలో కడప నగరం అలంఖాన్‌పల్లెలో పొదుపు సంఘాలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలు ఎలా ఉండాలి, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, అఘాయిత్యాలు జరిగే సమయంలో ఎలా వ్యవహరించాలి, అప్రమత్తంగా ఎలాఉండాలి అన్న అంశాలపై అవగాహన కల్పించారు. జనవిజ్ఞాన వేదిక నాయకులు శంకరయ్య మాట్లాడుతూ మహిళలే ఎక్కువగా మూఢనమ్మకాలు పాటిస్తున్నారని, మహిమలు, మంత్రాలను నమ్మకూడదన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ పిల్లలు ఉన్నతశిఖరాలను చేరుకోవడానికి ప్రణాళికాబద్ధంగా చదివించాలన్నారు. పొదుపు సంఘాల అధికారి వెంకట ప్రసాద్ మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక సంస్థ సమాజ హితంతో తమ విలువైన కాలాన్ని, ధనాన్ని వెచ్చించి అంకితభావంతో పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

నైపుణ్యం వెలికితీసేందుకే పోటీల నిర్వహణ



డ్రాయింగ్ పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

ఏఎఫ్‌యూ: విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీసేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం అధ్యాపకురాలు శాంతి పేర్కొన్నారు. ఈనెల 23వ తేదీన అంతరిక్ష దినోత్సవం పురస్కరించుకుని డా. వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ ఆధ్వర్యంలో ఖాజీపేట ఏపీ మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు పెయింటింగ్, క్విజ్ కాంపిటీషన్, నమూనాల తయారీలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఈనెల 23న నిర్వహించే జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ విజయ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు ప్రార్థనాలయం ప్రారంభం

కడప కల్చరల్ : కడప నగర శివార్లలోని పాత కడప గ్రామంలో బుధవారం సాయంత్రం 4.30 గంటలకు హిందూ ధర్మం సొసైటీ ప్రేయర్ టెంపుల్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో తొలి సామూహిక ప్రార్థనా దేవాలయాన్ని ప్రారంభించనున్నట్లు సంస్థ ప్రతినిధులు కాల్వ అర్జున్‌రెడ్డి, సోమ కళానాథరెడ్డి, అంతటి పెంచలయ్య, బలుసా జనార్దన్‌శ్రేష్ఠిలు తెలిపారు. పాత కడపలోని సచివాలయం పక్కన ఈ ఆలయాన్ని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

ఎగ్జిబిషన్ తిలకించాలి



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎల్‌డీఎం జనార్దనమ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని రామకృష్ణ హైస్కూలులో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామని, దానిని నగరవాసులు తిలకించి పలు అంశాలను తెలుసుకోవాలని ఎల్‌డీఎం జనార్దనమ్, కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ మురళీమోహన్ తెలిపారు. మంగళవారం మోచంపేటలో విభజన భయానక స్మరణ దినం ఫోటో ఎగ్జిబిషన్‌ను ఎల్‌డీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండియా, పాకిస్తాన్ విడిపోయిన సమయంలో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారని, అందుకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కడప నగరంలో ఏర్పాటు చేశామన్నారు. దానికి సంబంధించి ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ఎగ్జిబిషన్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ కె.మల్లయ్య, బ్యాంకు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడు అరెస్ట్

కడప అర్బన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) ఆవరణంలో ఇటీవల ఆటో చోరీకి గురైంది. ఈ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుపతికి చెందిన వెంకటేష్ ఆటోను రిమ్స్ ఆవరణలో పార్క్ చేసి తమ పేషెంట్లను చూసి వచ్చేలోపు ఆటోను దొంగిలించారు. ఈ ఆటోను అన్నమయ్య జిల్లా రామాపురం మండలం దూదేకుల పల్లికి చెందిన బాలగిరి మహమ్మద్ రఫీ చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. కడప కేంద్ర కారాగారం వద్ద మంగళవారం నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి ఆటోను రికవరీ చేసినట్లు సీఐ సీతారామిరెడ్డి తెలియజేశారు.

బహుమతుల అందజేత

వైవీయూ: కడప నగరంలోని కేఎల్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ ఎడమ చేతి వాటం దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని ఎడమ చేతివాటం గల విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.